క్లుప్తంగా

విద్యార్థి కుటుంబానికి ఆర్థిక సాయం



విద్యార్థి తండ్రికి నగదు అందజేస్తున్న వర్సిటీ అధికారులు

కర్నూలు(న్యూసిటీ): రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రాయలసీమ యూనివర్సిటీ ఎమ్మెస్సీ జువాలజీ ఫస్ట్ ఇయర్ విద్యార్థి హెచ్.దివాకర్ కుటుంబానికి తోటి విద్యార్థులు, వర్సిటీ అధికారులు తమకు తోచినంత సాయం అందించారు. తలా కొంత సేకరించిన రూ.48 వేల మొత్తాన్ని గురువారం వర్సిటీ రెక్టార్ ఆచార్య సీవీ కృష్ణారెడ్డి, ప్రొఫెసర్ ఆర్ భరత్‌కుమార్, తదితరులు విద్యార్థి తండ్రి దుర్గాప్రసాద్‌కు అందజేశారు.

ఎన్టీఆర్ గోల్డెన్ బ్రష్ అవార్డుకు జిల్లా వాసి ఎంపిక



ఎం.ఎం.బేగ్

కర్నూలు కల్చరల్: ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని కాకతీయ క్రియేటివ్ హార్ట్స్ అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ వారు నిర్వహించిన చిత్ర కళా పోటీలో జిల్లాకు చెందిన చిత్రకారుడు ఎం.ఎం.బేగ్ ఉత్తమ ప్రతిభ కనబరిచి ఎన్టీఆర్ గోల్డెన్ బ్రష్ అవార్డ్‌కు ఎంపికయ్యారు. ఈనెల 9న విజయవాడ బందర్ రోడ్‌లోని బాలోత్సవ్ భవన్‌లో నిర్వహించే అవార్డుల ప్రదానోత్సవంలో తనకు అవార్డు ఇవ్వనున్నట్లు బేగ్ గురువారం తెలిపారు.

ఖాళీ ఉద్యోగాలను భర్తీ చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, కారుమంచి డిమాండ్ చేశారు. గురువారం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో 2,35,794 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. వెంటనే వీటికి ఏపీపీఎస్సీ ద్వారా నోటిఫికేషన్లను విడుదల చేయాలన్నారు. అధికారంలోకి రాకముందు రాష్ట్ర ప్రభుత్వం క్యాలెండర్ ఇచ్చి ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి మోసం చేస్తోందన్నారు. వెంటనే గ్రూప్స్, డీఎస్సీ, ఎస్ఐ, పోలీసు ఉద్యోగాలను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

సురక్షిత ప్రయాణానికి ప్రాధాన్యత ఇవ్వండి

కర్నూలు(రాజ్‌విహార్): ప్రయాణికులను సురక్షితంగా గమ్యం చేర్చేందుకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని రోడ్డు రవాణా సంస్థ కర్నూలు-2 డిపో మేనేజర్ సర్దార్ హుసేన్ అన్నారు. గురువారం ఆయన డ్రైవర్లకు సురక్షిత ప్రయాణాలపై అవగాహన కల్పించారు. వర్షాల కారణంగా రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయని, ఇలాంటి వాటి నుంచి తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సురక్షిత ప్రయాణికులే ఆర్టీసీ లక్ష్యమని, అందుకు అనుగుణంగా పనిచేసి ప్రయాణికుల మన్ననలు పొందాలని సూచించారు.

సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(రూరల్): నగరంలోని వివిధ వార్డులలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నగర కార్యవర్గ సభ్యులు ఆర్.నరసింహులు కోరారు. గురువారం నగరంలోని 19, 20, 26వ వార్డులలో సీపీఎం ప్రతినిధి బృందం పర్యటించింది. ఈసందర్భంగా ఆర్ నరసింహులు మాట్లాడుతూ ఆయా వార్డుల్లో మురుగు కాలువలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కుక్కల బెడద నుంచి కాలనీ వాసులను రక్షించాలన్నారు. కార్యక్రమంలో ఆయా వార్డు ప్రజలు, సీపీఎం నాయకులు సాయిబాబా, లక్ష్మయ్య, శివకృష్ణ, సుబ్బరాయుడు, సత్య నారయణ, చెన్నయ్య పాల్గొన్నారు.

కోలుకోలేక మహిళ మృతి

కల్లూరు: మండల పరిధిలోని బొల్లవరం గ్రామానికి చెందిన పి.లక్ష్మీదేవి (57) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందింది. ఉలిందకొండ ఎస్ఐ నల్లప్ప తెలిపిన వివరాలు.. బొల్లవరం గ్రామానికి చెందిన పి.చిన్నయ్య, పి.లక్ష్మీదేవి దంపతులు కుటుంబ విషయంలో గత నెల 30న గొడవపడ్డారు. మాటామాటా పెరగడంతో క్షణికావేశంలో చిన్నయ్య భార్య తలపై కర్రతో కొట్టాడు. తలకు రక్త గాయమైన లక్ష్మీదేవిని కర్నూలులోని కిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడి నుంచి ఈనెల 3న కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. కోలుకోలేక లక్ష్మీదేవి బుధవారం రాత్రి మృతి చెందింది. కుమారుడు పి.రమేష్‌నాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



ఇక్కడ కనిపిస్తున్న చిత్రం కర్నూలు నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయ సమీపంలో నిర్మిస్తున్న వాణిజ్య సముదాయానిది. దీనికి పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు జీప్లస్-2 అనుమతి ఇచ్చారు. ప్లాన్‌లో గ్రౌండ్ ఫ్లోర్‌లో ఒక గది, అప్పర్ ఫ్లోర్‌లో పార్కింగ్, ఫస్ట్, సెకండ్ ఫ్లోర్లలోనూ ఒక్కో గది నిర్మించనున్నట్లు చూపారు. కానీ అడుగడుగునా నిబంధనలకు పాతరేశారు. భవనం ముందు రెండు దుకాణాల షట్టర్లు తొలగించకుండా లోపలే వాణిజ్య సముదాయ నిర్మాణం చేపట్టారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో ఒక గదిని చూపి ఏకంగా 12 దుకాణాలు నిర్మిస్తున్నారు. పొడవు 97, వెడల్పు 25 అడుగుల భవన సముదాయంలో అప్పర్ ఫ్లోర్‌లో పార్కింగ్ చూపడం మరో వింత. ఈ గందరగోళ అనుమతుల జారీకి రూ.లక్షల్లో ముడుపులు ముట్టినట్లు సమాచారం. ఇక మొదటి, రెండు అంతస్తుల్లో ఎన్ని గదులు నిర్మిస్తారో ఆ ఏరియా అసిస్టెంట్ సిటీ ప్లానర్, ప్లానింగ్ కార్యదర్శులకే ఎరుక.

నిబంధనలకు పాతర ..
అక్రమాల జాతర

వాణిజ్య, నివాస, బహుళ అంతస్తుల భవనాల నిర్మాణాల్లో నిబంధనలకు పాతరేస్తున్నా పట్టించుకునే నాథుడు లేడు. పార్కింగ్‌కు స్థలం వదలకున్నా, ప్లాన్‌లో ఒక రకంగా చూపి మరో రకంగా నిర్మాణం చేపడుతున్నా అడిగే దిక్కులేదు. ఆమ్యామ్యాలకు అలవాటు పడి అడ్డగోలుగా అనుమతులు ఇస్తుండటంతో నగరం ట్రాఫిక్ సమస్యతో అల్లాడుతోంది. కొంత మంది ప్లానింగ్ కార్యదర్శులు, సర్వేయర్లు, లైసెన్స్‌డ్ ఇంజినీర్లు నగరపాలక టౌన్ ప్లానింగ్ అధికారులకు మధ్యవర్తులుగా వ్యవహరించి భవన స్థాయిని బట్టి రూ.లక్ష నుంచి మూడు లక్షలకు బేరం మాట్లాడి కాసుల వర్షం కురిపిస్తుండటంతోనే వారు నిర్మాణాల వైపు తొక్కి చూడటం లేదనే విమర్శలున్నాయి. పత్రికల్లో కథనాలొచ్చినప్పుడు తూతూ మంత్రంగా తనిఖీలు చేపట్టి ఆ తర్వాత చేష్టలుడిగి చూస్తుండటంతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందు తప్పడం లేదు. సిబ్బంది సమస్యతో తనిఖీలు చేయడం లేదనే సాకు చెప్పే అధికారులు.. ఇప్పుడు తగినంత సిబ్బంది ఉన్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదనేది ప్రశ్నార్థకం.

- ప్లాన్‌కు విరుద్ధంగా వాణిజ్య భవన నిర్మాణాలు
- నిర్మాణాల్లో కనిపించని సెట్ బ్యాక్స్‌లు, పార్కింగ్ స్థలాలు
- 100 ఇళ్లకు ఒక ప్లానింగ్ కార్యదర్శి ఉన్నా పర్యవేక్షణ కరువు
- ఏడాది క్రితం గుర్తించిన 1,700 భవనాలపై చర్యలు శూన్యం

కర్నూలు (టౌన్): నగరంలో ఎలాంటి భవన నిర్మాణానికైనా పట్టణ ప్రణాళిక విభాగం అనుమతులు తప్పనిసరి. నిబంధనల ప్రకారం ప్లాన్ ఉంటేనే అనుమతులు ఇవ్వాల్సిన అధికారులు కాసులకు కక్కుర్తి పడి చూసీచూడనట్లు ఓకే చెబుతుండటంతో ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. గతంలో సిబ్బంది కొరత కారణంగా క్షేత్రస్థాయికి వెళ్లి తనిఖీలు చేయలేదని అధికారులు బుకాయించేవారు. నగరపాలక పట్టణ ప్రణాళిక విభాగంలో ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్, ముగ్గురు అసిస్టెంట్ సిటీ ప్లానర్లు, ముగ్గురు టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్లు, ఒక బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్, ఐదుగురు చైన్‌మెన్లు ఉన్నారు. ప్రతి సచివాలయ పరిధిలో 100 ఇళ్లకు ఒక ప్లానింగ్ కార్యదర్శి ఉన్నారు. అయినా నగరం నడిబొడ్డున అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి. ప్రధాన రహదారుల్లో నిర్మించే బహుళ అంతస్తుల వాణిజ్య సముదాయాల్లోనూ నిబంధనలు పాటించడం లేదు. ఎక్కడా పార్కింగ్ స్థలాలను వదలడం లేదు. సెల్లార్ పార్కింగ్ లేక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు మీదే వాహనాలు నిలిపితే ట్రాఫిక్ పోలీసులు ఫొటో తీసి రూ.500 నుంచి రూ.1000 చలానా వేస్తున్నారు.

ఆ భవనాలపై చర్యలేవి..?

రెండేళ్ల క్రితం అప్పటి నగరపాలక కమిషనర్ బాలాజీ తనిఖీలు నిర్వహించి నిబంధనలు పాటించని 1,700 ఇళ్లకు నోటీసులు జారీ చేశారు. ఆ తర్వాత ఇళ్లపై కానీ, అనుమతులు ఇచ్చిన అధికారులపై కానీ చర్యలు తీసుకోలేదు. దీంతో ఎన్ని అక్రమాలు చేసినా పట్టించుకోరన్న అభిప్రాయంతో కొందరు సిబ్బంది లంచాలు తీసుకుని ప్రధాన రహదారుల్లోనూ 30 అడుగుల రోడ్డు లేకున్నా యథేచ్ఛగా అనుమతులు ఇచ్చేస్తున్నారు.



గాంధీ నగర్‌లో సెట్‌బ్యాక్స్, పార్కింగ్ లేకుండా నిర్మిస్తున్న వాణిజ్య సముదాయం

నిబంధనలు పాటించని వాటిలో కొన్ని..

- అత్యంత రద్దీ ప్రాంతమైన గాంధీనగర్‌లో అగ్గిపెట్ట సైజ్‌లో రెండు ఫ్లోర్లతో కమర్షియల్ నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయి. ఎలాంటి సెట్ బ్యాక్స్ లేవు. ఏదైనా ప్రమాదం జరిగితే ఒక్క మనిషి కూడా రెండవ ఫ్లోర్‌కు వెళ్లే పరిస్థితి.
- గాయత్రీ ఎస్టేట్‌లోని విజయ డయాగ్నోస్టిక్ సెంటర్ ఎదురుగా ఉన్న లైన్‌లో ఆధునీకరణ పేరుతో రెండు ఫ్లోర్లు నిర్మించారు. పార్కింగ్ లేకపోవడంతో నిత్యం ట్రాఫిక్ సమస్యే నెలకొంటోంది. పేషెంట్లను తీసుకెళ్లే వాహనాలు కూడా ఈ ట్రాఫిక్‌లో ఇరుక్కుపోతున్నాయి.
- కొత్తపేట నుంచి పాతబస్టాండ్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో బాలాజీ నర్సింగ్ హోమ్ ఎదురుగా గ్రౌండ్‌ఫ్లోర్‌తో పాటు పైన మరో రెండు ఫ్లోర్లు వేశారు. ఇంకో ఫ్లోర్ కోసం పిల్లర్లు సిద్ధం చేశారు. ఈ వాణిజ్య భవనానికి పార్కింగ్ స్థలాన్ని ప్లాన్‌లో వెనుక వైపు చూపించారు. ఇది సాధ్యమా...?
- శంకరాస్ డిగ్రీ కళాశాల పక్కన ఉన్న రిలయన్స్ మార్ట్ ఎదురుగా నాలుగు ఫ్లోర్లతో వాణిజ్య సముదాయం నిర్మించారు. ఇక్కడ కనీసం చిన్న పాటి సెట్ బ్యాక్‌లు కూడా వదల్లేదు. నాలుగు ఫ్లోర్లకు వచ్చే వాహనదారులు రోడ్డు మీదే తమ వాహనాలను నిలిపేయాల్సి ఉంటుంది.
- స్థానిక అబ్దుల్లా ఖాన్ ఎస్టేట్‌లో ఇటీవల నిర్మించిన వాణిజ్య సముదాయాల్లో అక్రమాలు నెలకొన్నాయి.
- ఏ.క్యాంపులోని హార్ట్ అండ్ బ్రెయిన్ హాస్పిటల్ ఎదురుగా కింద అంతా వాణిజ్య షాపులు నిర్మిస్తున్నారు. పైన రెండు ఫ్లోర్లు నిర్మిస్తున్నారు. వాహనాల పార్కింగ్ విస్మరించారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తప్పవు

భవన నిర్మాణాల్లో నిబంధనలు పాటించడంలేదనే ఫిర్యాదులు వస్తున్నాయి. వాస్తవమే. సచివాలయాల ప్లానింగ్ కార్యదర్శులు కొందరు సక్రమంగా పనిచేయడం లేదు. ప్లాన్ ప్రకారం నిర్మాణాలు చేపడుతున్నారా, లేదా అన్నది బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు చూడాలి. అనుమతులకు విరుద్ధంగా ఉన్న భవనాల నిర్మాణాలను పరిశీలిస్తాం. నోటీసులు ఇస్తాం. అక్రమ నిర్మాణాలపై చర్యలు తప్పవు.

– మోహన్‌కుమార్, ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్

కొనసాగుతున్న వర్క్‌షాపు

కర్నూలు సిటీ: స్థానిక అశోక ఉమెన్స్, జి.పుల్లయ్య ఇంజినీరింగ్ కాలేజీల్లో ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఈనెల 3న ప్రారంభమైన ఐఎఫ్‌పీ, ట్యాబ్‌ల వినియోగంపై డీఈఓ డాక్టర్ రంగారెడ్డి పర్యవేక్షణలో వర్క్‌షాప్ గురువారం కొనసాగింది. ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ ద్వారా పిల్లలకు ఎలా బోధించాలి, బోధన తరువాత విద్యార్థులకు ఏ మేరకు అవగాహన కలిగింది, ఏ అంశంపైనైనా అనుమానాలను ఏవిధంగా నివృత్తి చేయాలనే విషయాలపై ఉపాధ్యాయులకు శిక్షకులు శిక్షణ ఇచ్చారు.

ఘనంగా శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతి

కర్నూలు కల్చరల్: భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతిని గురువారం బీజేపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ రాష్ట్ర నాయకులు కగ్గోలు హరీష్ బాబు, నాయకులు వెంకటేశ్వర్లు, దరేశ్ గౌడ్, గణేష్, విక్కీ వెంకటేష్ తదితరులు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

టెక్నాలజీ వినియోగంతో మెరుగైన బోధన

కర్నూలు సిటీ: పాఠశాల విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు టెక్నాలజీ వినియోగంతో మెరుగైన బోధన చేసేందుకు అవకాశం కలిగిందని నెక్స్ట్ ఎడ్యుకేషనల్ సొసైటీ సొల్యూషన్స్ సీఎస్ఆర్ మేనేజర్ మహమ్మద్ ఇద్రిస్ అన్నారు. గురువారం ఎస్‌ఏపీ క్యాంపులోని కట్టమంచి రామలింగారెడ్డి స్మారక నగర పాలక సంస్థ పాఠశాలలో క్యూబీ రూట్స్ ఫౌండేషన్ ఇండియా లిమిటెడ్ సౌజన్యంతో రూ.1.50 లక్షల విలువైన ప్రొజెక్టర్, కంప్యూటర్, ఇతర పరికరాలను పంపిణీ చేశారు. ఈ పరికరాలతో సబ్జెక్టును ఇన్‌స్టాలేషన్ చేసి ఉపాధ్యాయులకు సాంకేతిక పరిజ్ఞాన వినియోగంపై వివరించారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం వెంకటరెడ్డి, క్యూబ్ రూట్స్ ఫౌండేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ సీ.కే సునీల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ సమాచారం

నేడు విద్యుత్ కోతలు

కర్నూలు(రాజ్‌విహార్): నగరంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ కోతలు విధించనున్నట్లు దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు టౌన్ ఆపరేషన్స్ ఈఈ రమేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక వైఎస్ఆర్ సర్కిల్‌లో మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు చేపడుతున్న రోడ్డు విస్తరణ పనుల కోసం నరసింహారావు పేట, ప్రకాష్ నగర్, గిప్సన్ కాలనీ, ఈశ్వర్ నగర్, భాగ్య నగర్, బంగారు పేట, నరసింహారెడ్డి నగర్, పోలీస్ క్వార్టర్స్, ఎల్‌బీఎస్ నగర్, చిదంబరరావు వీధి, కొత్తపేట, ఖండేరి, ఖల్లా, సాయిబాబా సంజీవయ్య నగర్, జిల్లా కోర్టు తదితర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని పేర్కొన్నారు.

జగ్జీవన్‌రామ్‌కు నివాళి

కర్నూలు(రాజ్‌విహార్): బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతిని గురువారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మహేశ్వరరెడ్డి, వైఎస్ఆర్‌సీపీ నాయకులు సీహెచ్ మద్దయ్య, కర్నాటి పుల్లారెడ్డి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

- కర్నూలు (రూరల్): బాబూ జగ్జీవన్ రామ్ ఆశయ సాధనకు కృషి ప్రతి కార్యకర్త కృషి చేయాలన్ని డీసీసీ అధ్యక్షులు సుధాకర్ బాబు సూచించారు. గురువారం పార్టీ కార్యాలయంలో బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఐదు రోడ్ల కూడలిలో బాబూ జగ్జీవన్ రామ్ కాంస్య విగ్రహం వద్ద వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు.

అపరకర్మల భవనానికి వసతులు కల్పించండి



మున్సిపల్ కమిషనర్‌ను సన్మానించిన బ్రాహ్మణ నేతలు

కర్నూలు(అర్బన్): నగర పరిధిలోని తుంగభద్ర నది తీరాన బ్రాహ్మణులకు కేటాయించిన అపర కర్మల భవనానికి వసతులు కల్పించాలని నగర బ్రాహ్మణ అపర కర్మల భవన నిర్వహణ కమిటీ అధ్యక్షులు ఎస్ వెంకటరామరాజు, ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణకాంత్ శర్మ తదితరులు గురువారం నగర పాలక సంస్థ కమిషనర్ భార్గవతేజను కలిసి వినతి పత్రం అందించారు. భవనంలో అపరకర్మలు నిర్వహించుకునేందుకు నీటి వసతి, ఓవర్‌హెడ్ ట్యాంక్, కిచెన్ ప్లాట్‌ఫాం, ప్రహరీగోడ, రెండు స్నానాల గదులు, టాయ్‌లెట్లు, ఆస్తికలు భద్రపరచుకునేందుకు అల్మారాలు ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం కమిటీ నేతలు కమిషనర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో కమిటీ కోశాధికారి ఎస్ కృష్ణమూర్తి, ఉపాధ్యక్షులు మామిళ్లపల్లి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి పెద్దపీట



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: కల్లూరు అర్బన్ 29వ వార్డులోని సప్తగిరి నగర్, సాయినాథ్ కాలనీలో గురువారం సాయంత్రం స్థానిక కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరిస్తూ బుక్‌లెట్లను పంపిణీ చేశారు. స్థానిక సమస్యలను సకాలంలో పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్పొరేటర్లు లక్ష్మీకాంతరెడ్డి, నారాయణరెడ్డి, నాగలక్ష్మిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ నాగభూషణం

కర్నూలు: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం సూచించారు. ఎ.క్యాంప్‌లోని మాంటిస్సోరి స్కూల్‌లో ట్రాఫిక్ నియమాలపై విద్యార్థులకు ప్రొజెక్టర్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదన్నారు. లైసెన్స్ లేకుండా ప్రమాదాలకు గురైతే పోలీసు కేసులో ఇరుక్కుని ప్రభుత్వ ఉద్యోగాలకు అవకాశం కోల్పోవాల్సి వస్తుందన్నారు. స్నేక్ డ్రైవింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, త్రిబుల్ రైడింగ్, అతి వేగం ప్రమాదకరమని హెచ్చరించారు. ప్రధాన రహదారుల్లో వాహనాలు ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్ చేయరాదన్నారు. లైసెన్స్ లేని, మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇస్తే అవి ప్రమాదానికి గురైతే వాహనం ఇచ్చినవారు కూడా ముద్దాయిలవుతారని హెచ్చరించారు. లైసెన్స్ లేకుండా వాహనాలపై పాఠశాలలకు వచ్చే విద్యార్థులను అనుమతించొద్దని స్కూల్ హెడ్‌మాస్టర్‌కు సూచించారు. ట్రాఫిక్ సిబ్బందితో పాటు పాఠశాల బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

16న స్వంత వృత్తుల వారి సమ్మేళనం

కర్నూలు కల్చరల్: వికాస భారతి ఆధ్వర్యంలో ఈనెల 16న ఓర్వకల్లు మండలం కాల్వబుగ్గ సమీపంలోని సురభి గోశాలలో 'స్వంత వృత్తుల వారి సమ్మేళనం' నిర్వహించనున్నట్లు సమన్వయ కర్త వంగాల నాగేశ్వరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 'మన దేశ ధర్మముల ఔన్నత్యం' అంశంపై వికాస భారతి సంఘటనా కార్యదర్శి నాగేంద్ర ప్రసాద్, 'హిందూ సమాజం ముందున్న సవాళ్లు - సమాధానం' అంశంపై వికారాబాద్ విద్యావేత్త కూర జయదేవ్, 'గ్రామమే ఒక కుటుంబం' అంశంపై సామాజిక సమరసత తెలంగాణ ప్రాంత సంయోజకులు అప్పాల ప్రసాద్ ప్రసంగిస్తారన్నారు.

18న కర్నూలు మండల సర్వసభ్య సమావేశం

కర్నూలు (న్యూటౌన్): ఈనెల 18న కర్నూలు మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ వెంకటేశ్వరమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కేఏ ఆజాంఖాన్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి మండల పరిషత్ ప్రత్యేక అధికారి, కర్నూలు ఎంపీ డాక్టర్ సింగరి సంజీవ్‌కుమార్, కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ హాజరవుతారన్నారు. మండల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలతో హాజరు కావాలన్నారు.

కేసీ కాల్వకు నీరు విడుదల

గూడూరు: సుంకేసుల డ్యామ్ నుంచి కర్నూలు ప్రజల తాగునీటి అవసరాలకు 189 క్యూసెక్కుల నీటిని కేసీ కెనాల్‌కు విడుదల చేసినట్లు గురువారం డ్యాం అధికారులు తెలిపారు. ఇన్‌ఫ్లో నిలిచి పోయిందని, డ్యాంలో 0.954 టీఎంసీల నీరు నిల్వ ఉందని పేర్కొన్నారు.

బడిబయట పిల్లలను పాఠశాలలో చేర్పించాలి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్‌జి.సృజన

కర్నూలు (సెంట్రల్): బడి బయట పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించే బాధ్యతను మండల విద్యాశాఖ అధికారులు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ సృజన ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో విద్యాశాఖకు సంబంధించిన వివిధ అంశాలపై ఆమె అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో 24,424 మంది విద్యార్థులు బడి బయట ఉన్నారని, ఇందులో సిస్టమ డ్రాప్ అవుట్‌పిల్లలు 11,865 మంది కాగా, స్కూలు డ్రాప్‌అవుట్స్ పిల్లలు 12559 మంది ఉన్నారన్నారు. పాఠశాలలు తెరకముందు నుంచి వారిని గుర్తించి చేర్పించాలని కోరుతున్నా పట్టించుకోకపోవడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు, కల్లూరు మండలాల్లో బడి బయట పిల్లలు ఎక్కువగా ఉన్నారని, వారిని ప్రణాళిక ప్రకారం సోమవారం నాటికి పాఠశాలల్లో చేర్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో పదో తరగతిఫెయిల్ అయిన విద్యార్థులు 8,786 మంది ఉన్నారని, వీరిని కూడా పాఠశాలల్లో చేర్పించాలన్నారు. లేకపోతే వీరిలో బాలురు బాల కార్మికులుగా మారే, బాలికలకు వివాహాలు చేసే ప్రమాదం ఉందన్నారు. జగనన్నవిద్యా కానుక కిట్లను నూరు శాతం పంపిణీ చేసినా బయోమెట్రిక్ తీసుకోవడంలో వెనుకబడి ఉన్నారన్నారు. ఎమ్మిగనూరు, కోసిగి, మంత్రాలయం మండాలల్లో 60 శాతం మాత్రమే బయోమెట్రిక్ తీసుకున్నారని, ఈ మండలాలతో పాటు ఇతర మండలాలు కూడా రెండు రోజుల్లో నూరు శాతం కావాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల వారీగా విద్యార్థుల హాజరుపై మానిటరింగ్ చేయాలని ఎంఈఓలను ఆదేశించారు. ఉపాధ్యాయుల హాజరు శాతం తగ్గకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు ఫోలిక్ ఐరన్ టాబ్లెట్స్‌ను పంపామని, సోమవారం నుంచి పాఠశాలల్లో ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఈఓ రంగారెడ్డి, సమగ్ర శిక్ష ఏపీసీ వేణుగోపాల్ పాల్గొన్నారు.

అర్హులందరికీ ధ్రువపత్రాలు





జగనన్న సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న కమిషనర్ భార్గవ్‌తేజ, సర్టిఫికెట్ అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ క్రాంతికుమార్

కర్నూలు (టౌన్): అర్హులందరికీ ధ్రువపత్రాలు అందజేస్తున్నామని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ తెలిపారు. గురువారం స్థానిక గడ్డ వీధి, అంబేడ్కర్ కాలనీలో జగనన్న సురక్ష సదస్సులు నిర్వహించి అవసరమైన వారికి ధ్రువపత్రాలు అందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకం అన్ని వర్గాలకు అందాలని, ఏవైనా ఇబ్బందులు ఉన్నా వెంటనే పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. విద్యా సంవత్సరంతో పాటు ఈ ఏడాది సంక్షేమ పథకాలకు అవసరమైన సర్టిఫికెట్లు అందిస్తున్నామన్నారు. సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రమాదేవి, ప్రత్యేక అధికారులు జునీద్, మన్సూర్, కర్నూలు తహసీల్దార్ శివరామ్, కార్పొరేటర్లు షేక్ నీలోఫర్, సాంబశివరావు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

వడ్డేగేరిలో ఎస్వీ మోహన్‌రెడ్డి

నగరంలోని వడ్డేగేరిలో నిర్వహించిన జగనన్న సురక్ష సదస్సులో మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో నూతన అధ్యాయమన్నారు. అనంతరం వార్డు కార్పొరేటర్ క్రాంతి కుమార్‌తో కలిసి లబ్ధిదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

కుల ధ్రువీకరణ పత్రం మంజూరు



ఇక్కడ ధ్రువపత్రం అందుకుంటున్న మహిళ పేరు కళ్యాణి. అంబేడ్కర్ కాలనీలో నివసిస్తోంది. సర్వేలో భాగంగా ఇంటికెళ్లిన సచివాలయ సిబ్బందికి కులధ్రువీకరణ పత్రం కావాలంటూ వివరాలు ఇచ్చింది. 24 గంటలు గడవక ముందే జగనన్న సురక్ష కార్యక్రమంలో సర్టిఫికెట్ అందుకుంది. గతంలో కులధ్రువీకరణ పత్రం కావాలంటే ఎన్నో ఇబ్బందులు ఉండేవి. కార్యాలయాల చుట్టు తిరిగినా సర్టిఫికెట్లు వచ్చేవి కావు. ఇప్పుడు ఇంటికి వచ్చి. వివరాలు తీసుకుని, తక్కువ సమయంలోనే సర్టిఫికెట్ ఇవ్వడంతో మహిళ ఆనందం వ్యక్తం చేసింది.

పైసా ఖర్చు లేదు..



అధికారులతో ఆదాయ ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న ఈ మహిళ పేరు మైమూన్. నగరంలోని గడ్డ వీధికి చెందిన ఈమె కూతురు కళాశాలలో చదువుతోంది. ఆదాయ ధ్రువపత్రం అవసరం కావడంతో దరఖాస్తు చేసుకుంది. పైసా ఖర్చు లేకుండా సర్టిఫికెట్ అందడంతో సంతోషం వ్యక్తం చేసింది.

మహారాజశ్రీ కర్నూలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో
I.P. No. 25/2023
రత్నపల్లి గణేష్ ..అర్జీదారు
(ఎదురు)
నంద గోపాల్ వగైరా ..రెస్పాండెంట్లు
జనరల్ నోటీసు
కర్నూలు జిల్లా, కర్నూలు గ్రామ ప్రజలకు తెలియజేయడమేమనగా కర్నూలు గ్రామం లక్ష్మణ్ సింగ్ వీధి ఇ.నెం. 64/42, ఆర్.శ్రీనివాసులు కుమారుడు ఆర్.గణేష్ తనను దివాళాదారుగా తీర్మానించమని కోరుతూ దివాళా అర్జీ దాఖలు చేసినాడు. ఇందుపైన ఎవరికైనా అక్షేపణలు వున్నా 21-08-2023వ తేదీ ఉదయం 10.30 గంటలకు పై కోర్టులో హాజరై తెలుపుకొనవలెను. లేని యెడల పరోక్షమున విచారించి తీర్మానింపబడును.
కోర్టు వారి ఉత్తర్వు మేరకు
సి.వి.శ్రీనివాసులు, పి.రఘుమోహన్
అర్జీదారుపరం అడ్వకేట్లు, కర్నూలు.

PUBLIC NOTICE
ఇందుమూలముగా యావన్మంది ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా, నా క్లయింటు అనగా Mr. కర్నాటి మహేంద్రరెడ్డి తండ్రి కర్నాటి సిద్దారెడ్డి, R/o ఇ.నెం. 11-2-124, దా॥ సుధాకర్‌రెడ్డి హౌస్, మాచర్ల, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ గారు దిగువ తెలిపిన షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని సదరు స్థిరాస్తి హక్కుదారులైన (1) Mr. టి.రాఘవేంద్రారెడ్డి తండ్రి టి.వెంకటరెడ్డి (2) శ్రీమతి టి.పద్మావతి తండ్రి టి.వెంకటరెడ్డి, R/o ఇ.నెం.87/275K-6,7, కిసాన్‌నగర్, కర్నూలు సిటీ & జిల్లా అనువారి నుండి కొనుగోలు చేయుటకు నిశ్చయించుకున్నారు. కావున సదరు స్థిరాస్తిపైన ఎవరికైన ఏ విధమైన అక్షేపణలుగాని, అభ్యంతరాలు గాని ఉన్న యెడల అట్టి వాటిని నేటి నుండి ఏడు (7) దినములలోగా దిగువ తెలిపిన చిరునామాలో తెలియపర్చగలరు. లేని యెడల సదరు స్థిరాస్తిపై ఎవ్వరికీ ఏ విధమైన అక్షేపణలు లేవని భావించి సదరు స్థిరాస్తిని పై తెలిపిన నా క్లయింటు విక్రయించుకొని స్థిరపర్చుకొనగలరు.
షెడ్యూలు దాఖలా ఆస్తి: కర్నూలు డి॥, కల్లూరు సబ్॥ డి॥, కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్‌లో చేరిన 81వ వార్డులోని డి.నెం. 81/263 సమీపమున గల కల్లూరు గ్రామ పొలములోని సర్వే నెంబరు 601/2 & 602 పైకి వేయబడిన ప్లాట్లకు కల్లూరు గ్రామ పంచాయితీ ఆఫీసర్ గారిచే 31-5-1965వ తేదీన G.O.H.S.No. 648/1965 గా అప్రూవల్ కాబడిన 'విజయనగర్' కాలనీ నందలి ప్లాట్లపైకి గల ప్లాటు నెం. 28నకు చెక్కుబంది వివరము:
తూర్పు: ప్లాటు నెం. 22, పడమర: 30 అడుగుల వెడల్పు గల రోడ్డు, ఉత్తరం: ప్లాటు నెం. 29, దక్షిణం: ప్లాటు నెం. 27
G.S.Vijaya Bhaskar Reddy, BA, BL, Advocate,
H.No. 87-1077-1, Ganesh Nagar, Nandyal Road, Near Partha Sarathi Towers, Kurnool. Cell: 93479 28866, 99854 74567